క్లుప్తంగా

విక్టోరియాకు ఏయూ డాక్టరేట్

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం విద్యా విభాగం పరిశోధక విద్యార్థి పి.గ్లోరియా విక్టోరియాకు ఏయూ డాక్టరేట్ లభించింది. విద్యా విభాగం విశ్రాంత ఆచార్యులు నిమ్మ వెంకటరావు, విభాగాధిపతి ఆచార్య టి.షారోన్ రాజుల సంయుక్త పర్యవేక్షణలో రోల్ ఆఫ్ సైన్స్ టీచర్స్ ఇన్ డెవలపింగ్ సైంటిఫిక్ ఆటిట్యూడ్స్ ఎమాంగ్ సెకండరీ స్కూల్ స్టూడెంట్స్ ఇన్ విశాఖపట్నం డిస్ట్రిక్ట్ అంశంపై జరిపిన పరిశోధనకు ఆయనకు డాక్టరేట్ వచ్చింది. ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి నుంచి గ్లోరియా డాక్టరేట్ ఉత్తర్వులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనను విభాగ ఆచార్యులు, పరిశోధకులు, విద్యార్థులు అభినందించారు.

ఘనంగా మృత్యుంజయ స్వామి ఆలయ వార్షికోత్సవం


ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

ఆరిలోవ: చినగదిలి నార్త్ షిర్డీ సాయిబాబా ఆలయ సముదాయంలో కొలువుదీరిన అంబికా సమేత మృత్యుంజయ స్వామి ఆలయ వార్షికోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. అర్చకులు నగేష్ శర్మ ప్రభాష్.. స్వామిని నూతన వస్త్రాలు, పూలమాలలతో అలంకరించారు. వేద మంత్రాల మధ్య పలువురు దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మధ్యాహ్నం ఆలయ నిర్వాహకులు భక్తులకు అన్నసమారాధన చేపట్టారు. చినగదిలి, పెదగదిలి, సూర్యతేజానగర్, సంతపాలెం ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకుని, స్వామి ప్రసాదం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ వానపల్లి అప్పారావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు సమ్మర్ క్యాంప్

సీతంపేట: ఇండియా యూత్ ఫర్ సొసైటీ, ఇందిరా గాంధీ జూ పార్కు సంయుక్తంగా ఐదు రోజుల పాటు పర్యావరణ పరిరక్షణ యోధుల సమ్మర్ క్యాంప్ నిర్వహిస్తున్నట్టు సంస్థ ప్రతినిధి గిడుతూరి నేహా తెలిపారు. రామా టాకీస్ సమీపంలోని సంస్థ కార్యాలయంలో సోమవారం కార్యక్రమ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 10 నుంచి 18 ఏళ్ల వయస్సు గల వారు ఈ క్యాంప్‌లో పాల్గొనవచ్చని చెప్పారు. 3 రోజులు జూ పార్కులో, ఒక రోజు రీసైక్లింగ్ ప్లాంట్‌లో, మరో రోజు బయోడైవర్సిటీ పార్కులో ఈ శిబిరం ఉంటుందన్నారు. పిల్లలు, యువతకు పర్యావరణం, జంతువుల పరిరక్షణ, వ్యర్థాల నిర్వహణపై అవగాహన కల్పిస్తామని పేర్కొన్నారు. ఆసక్తి గల వారు 89780 19596 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

ఓటు హక్కుపై అవగాహన

బీచ్ రోడ్డు: అందరూ ఓటెయ్యాలని.. ఎవరూ ఓటు అమ్ముకోరాదని పీపుల్స్ పవర్ ఎన్జీవో సంస్థ కార్యదర్శి నిమ్మకాయలు భాస్కర్ పిలుపునిచ్చారు. సోమవారం స్వీప్ కార్యక్రమంలో భాగంగా గ్రీన్ క్లైమేట్, జేసీఐతో కలిసి ఆర్కే బీచ్‌లో ఆయన సందర్శకులకు ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన ఓటే మన భవిష్యత్తును నిర్ణయిస్తుందని, ఐదేళ్ల పాటు మనల్ని సజావుగా పాలించే నాయకులను ఎన్నుకునే బాధ్యత మనపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రీన్ క్లైమేట్ కార్యదర్శి జె.వి.రత్నం పాల్గొన్నారు.

స్వతంత్ర అభ్యర్థి ఖాన్ ప్రచారం


యువత మద్దతు కోరుతున్న ఖాన్

ఎంవీపీ కాలనీ: విశాఖ ఎంపీ స్థానానికి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఎంజీఎం ఖాన్ సోమవారం తూర్పు నియోజకవర్గంలో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఏయూ, మద్దిలపాలెం, ఎంవీపీ కాలనీలోని పలు విద్యా సంస్థలను సందర్శించి యువత మద్దతు కోరారు.

ఆధునిక బస్ బేలు

డెవలప్‌మెంట్ వాచ్



చినవాల్తేరులో ఏయూ అవుట్ గేట్ సమీపంలో రూ.19.5 లక్షలతో ఏర్పాటు చేసిన బస్‌బే

ఆరిలోవ: పైకప్పులు లేకుండా అధ్వానంగా దర్శనమిచ్చే బస్ షెల్టర్లకు వైఎస్ జగన్ సర్కారు కొత్త రూపు తీసుకొచ్చింది. బస్‌బేల పేరిట ఆధునికంగా తీర్చిదిద్దింది. నగరంలో ప్రయాణికుల సౌకర్యార్థం జీవీఎంసీ అధికారులు స్మార్ట్‌సిటీ అభివృద్ధిలో భాగంగా బస్‌బేలు నిర్మించారు. తూర్పు నియోజకవర్గంలో రూ.లక్షలు నిధులు ఖర్చుచేసి పలుచోట్ల వీటిని ప్రత్యేకంగా నిర్మించారు. విద్యుత్ దీపాలు, టైల్స్, గ్రానైట్ ఫ్లోరింగ్‌తో సుందరీకరించారు. ప్రయాణికులు కూర్చోవడానికి సౌకర్యమంతమైన సిమెంట్ బెంచీలు అమర్చి విశాలంగా గాలి, వెలుతురు వచ్చేటట్లు ఏర్పాట్లు చేశారు. వర్షానికి తడవకుండా పటిష్టమైన పైకప్పులు అమర్చారు. ఈ బస్‌బేలు తమ ప్రాంతాలకు కొత్త కళను తీసుకొచ్చాయని ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



బీఆర్‌టీఎస్‌లో పెదగదిలి వద్ద రూ.10 లక్షలతో నిర్మించిన బస్‌బే



వెంకోజీపాలెంలో ఆంజనేయస్వామి ఆలయం ఎదురుగా రూ.24 లక్షలతో నిర్మించిన బస్‌బే


బీచ్‌రోడ్డులో ఆర్కే బీచ్ వద్ద రూ.16 లక్షలతో ఏర్పాటు చేసిన బస్‌బే

ఫ్యాన్ గుర్తుకు ఓటేయండి


దయాల్‌నగర్‌లో ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎంవీవీ సతీమణి నాగజ్యోతి


11వ వార్డు స్వామి వివేకానందనగర్‌లో ప్రచారం చేస్తున్న గొలగాని శ్రీనివాస్

ఎంవీవీ సతీమణి నాగజ్యోతి ఎన్నికల ప్రచారం

ఆరిలోవ: తూర్పు నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ నాయకుల ఎన్నికల ప్రచారం జోరందుకుంది. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ సతీమణి ముళ్లపూడి నాగజ్యోతి జీవీఎంసీ 9వ వార్డులో సోమవారం విస్తృత ప్రచారం చేశారు. స్థానిక కార్పొరేటర్ స్వాతి, పలువురు మహిళా కార్యకర్తలతో కలసి ఆమె దయాల్‌నగర్‌లో ఇంటింటికి వెళ్లి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఎంవీవీ సత్యనారాయణను ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. ఈ ప్రచారంలో పార్టీ మహిళా నాయులు ఎం.జ్ఞానిత, గన్నమనేని పద్మ, మందాడి రాధిక, నందిని, సీతామహాలక్ష్మి, జి.శ్రీదేవి పాల్గొన్నారు.

11వ వార్డులో..

జీవీఎంసీ 11వ వార్డులో వైఎస్సార్‌సీపీ నాయకులు ముమ్మర ప్రచారం చేశారు. 11వ వార్డు స్వామి వివేకానందనగర్‌లో పార్టీ రాష్ట్ర కార్యదర్శి గొలగాని శ్రీనివాస్ కార్యకర్తలతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి నియోజకవర్గం ఎమ్మెల్యేగా ఎంవీవీ సత్యనారాయణను, ఎంపీగా బొత్స ఝాన్సీలక్ష్మిని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

వైఎస్సార్‌సీపీలో భారీగా చేరికలు


వైఎస్సార్‌సీపీలో చేరిన 13వ వార్డుకు చెందిన టీడీపీ, జనసేన కార్యకర్తలతో ఎంవీవీ సత్యనారాయణ

ఆరిలోవ: నిత్యం చేరికలతో తూర్పు నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ బలం మరింత పుంజుకుంటోంది. సోమవారం జీవీఎంసీ 13వ వార్డు నుంచి సుమారు 100 మందికి పైగా టీడీపీ, జనసేన కార్యకర్తలు వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి పార్టీ తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎంవీవీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద ప్రజల సంక్షేమం కోసం పాలన సాగించారన్నారు. అది నచ్చి చాలా మంది యువకులు, ప్రతిపక్ష పార్టీల నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్‌సీపీలో చేరుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకుడు కెల్ల సత్యనారాయణ, ఎస్సీ సెల్ జనరల్ సెక్రటరీ పిల్లి వీర్రాజు, తదితరులు పాల్గొన్నారు.

ఎఫ్‌సీఐలో డిప్లమో కోర్సు ప్రారంభం


డిప్లమో కోర్సులో మొదటి బ్యాచ్‌లో చేరిన డిఫెన్స్ విద్యార్థులు

ఆరిలోవ: ప్రభుత్వ ఫుడ్‌క్రాఫ్ట్ ఇన్‌స్టిట్యూట్(ఎఫ్‌సీఐ) లో డిప్లమో ఇన్ అసిస్టెంట్ కేటరింగ్ మేనేజ్‌మెంట్ కోర్సు సోమవారం ప్రారంభమైంది. ఎఫ్‌సీఐలో కొత్తగా ఏర్పాటు చేసిన ఈ కోర్సులో ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్ విభాగాల నుంచి 40 మంది చేరారు. ఈ కోర్సును సోమవారం ఇండియన్ నేవీ జాయింట్ కంట్రోలర్ ఎయిర్ ఫోర్స్ కమాండెర్ ఎ.శ్రీహర్ష, ఏయూ డిఫెన్స్ స్టడీస్ స్కూల్ అడ్జంక్ట్ ప్రొఫెసర్ ఉజ్వల్ కుమార్ ఘటక్ ప్రారంభించారు. ఈ కోర్సు 24 వారాలు కొనసాగుతుందని ఎఫ్‌సీఐ ప్రిన్సిపాల్ కె.వెంకటరమణ తెలిపారు. ఈ కోర్సులో శిక్షణ పొందిన వారికి మంచి హాస్పిటాలిటీ నైపుణ్యం వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌సీఐ అధ్యాపకులు పాల్గొన్నారు.

విశ్వసనీయతకు పట్టం కట్టండి


ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ, ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణను సత్కరిస్తున్న పార్టీ నాయకులు


సిద్ధం సభకు హాజరైన 18వ వార్డు ప్రజలు

- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ పిలుపు
- జగన్‌ది దళారుల్లేని పాలన : ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ
- 18వ వార్డులో సిద్ధం సభ

ఎంవీపీ కాలనీ: పేదల అభ్యున్నతి, సంక్షేమంతో పాటు విద్య, వైద్య, సేవా రంగాల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించిన విశ్వసనీయ పాలనకు మరోసారి పట్టం కట్టాలని వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ పిలుపునిచ్చారు. 18వ వార్డు ఎంవీపీ కాలనీలో మేము సిద్ధం–మా బూత్ సిద్ధం పేరిట నిర్వహించిన సభలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ సర్కారులో రాష్ట్రంలోని ప్రతి ఇంటికీ మేలు జరిగిందన్నారు. పిల్లల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని విద్యా రంగాన్ని మహోన్నతంగా తీర్చిదిద్దారన్నారు. వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు తేవడంతో పాటు అన్ని రకాల సౌకర్యాలు అందుబాటులోకి తెచ్చారన్నారు. ఆరోగ్యశ్రీ ద్వారా కార్పొరేట్ వైద్యాన్ని ప్రజలకు చేరువ చేశారని కొనియాడారు. లబ్ధి పొందిన ప్రతి ఇల్లూ ప్రస్తుత ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి అండగా నిలవాలని కోరారు. సూపర్ సిక్స్ పథకాలంటూ చంద్రబాబు మరోసారి రాష్ట్ర ప్రజలను మోసం చేయాలని చూస్తున్నారని, అప్రమత్తంగా ఉండాలన్నారు. వైఎస్సార్‌సీపీ విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ మాట్లాడుతూ ప్రస్తుత ఎన్నికలు పెత్తందారులకు, పేదలకు మధ్య జరుగుతున్న యుద్ధానికి ప్రతీక అన్నారు. గత ఐదేళ్లలో దళారులకు తావులేకుండా సీఎం జగన్ ప్రతి ఇంటికి అభివృద్ధిని చేరువ చేసి జనహృదయాలను గెలుచుకున్నారన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా పాలనా యంత్రాంగాన్ని ప్రజల ముంగిటకు తీసుకెళ్లారని చెప్పారు. మరోసారి అలాంటి సుపరిపాలన కోసం సీఎం జగన్ ప్రభుత్వం ఏర్పాటుకు అండగా నిలవాలని ఆమె ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ చైర్మన్ పేర్ల విజయ చందర్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి పీవీ నారాయణ, ఎస్సీ జోనల్ ఇన్‌చార్జ్ ఎ.రాజబాబు, వాసుపల్లి జానకీరామ్, వాసుపల్లి ఎల్లాజీ, పలువురు ఇన్‌చార్జ్‌లు, డైరెక్టర్లు పాల్గొన్నారు.


ఏయూ క్యాంపస్: 20వ వార్డులో కరపత్రాలు అందిస్తూ ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ మహిళా కార్యకర్తలు


ఎంవీపీ కాలనీ: 17వ వార్డు ఎంవీపీ కాలనీ సెక్టార్-8లో నవరత్నాలు ఫ్లెక్స్‌పై ప్రచారం చేస్తున్న కార్పొరేటర్ గేదెల లావణ్య, తదితరులు




బీచ్ రోడ్డు: 28వ వార్డులో సీఎం జగన్ అమలు చేసిన పథకాలపై ప్రచారం చేస్తున్న కార్పొరేటర్ పల్లా అప్పలకొండ, వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి పల్లా దుర్గారావు


మద్దిలపాలెం : జీవీఎంసీ 23వ వార్డు మద్దిలపాలెంలో వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ, ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణకు మద్దతుగా ప్రచారం చేస్తున్న పార్టీ వార్డు ఇన్‌చార్జి గుడ్ల సత్యారెడ్డి, పార్టీ నాయకులు


మద్దిలపాలెంలో ప్రచారం చేస్తున్న 22వ వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు పీతల గోవింద్


ఎంవీపీ కాలనీ: వైఎస్సార్‌సీపీ తరఫున 18వ వార్డు మూలపాలెంలో ప్రచారం చేస్తున్న మత్స్యకార కార్పొరేషన్ చైర్మన్ పేర్ల విజయచందర్, పార్టీ నాయకులు

తోటగరువు రోడ్డు.. ఇక డబుల్


పెదగదిలి-తోటగరువు రోడ్డు మధ్యలో నిర్మిస్తున్న డివైడర్

ఆరిలోవ: పెదగదిలి నుంచి తోటగరువు రోడ్డుకు మోక్షం కలుగుతోంది. ఇది విశాలమైన రోడ్డు. అయినప్పటికీ ఇంత వరకు ఇది సింగిల్ రోడ్డు కావడంతో ఎదురెదురుగా ప్రయాణించే వాహనాలు తరచూ ఢీకొని ప్రమాదాలు జరుగుతుండేవి. ఇప్పుడు ఆ సమస్యకు చెక్ పడనుంది. ఈ రోడ్డు మధ్యలో డివైడర్ నిర్మిస్తున్నారు. దీంతో పాటు రోడ్డుకు ఇరువైపులా పాదచారుల కోసం ఫుట్‌పాత్‌లు కూడా నిర్మించనున్నారు. ఇక్కడ డివైడర్ నిర్మాణం పనులు పూర్తి కాగానే డబుల్ రోడ్డు సిద్ధం కానుంది. ఈ నిర్మాణం పూర్తయితే ఇక్కడ తోటగరువులో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు, ఆరిలోవ, బాలాజీనగర్, రవీంద్రనగర్, తోటగరువు, పెదగదిలి ప్రాంతాల వారికి సౌలభ్యంగా ఉంటుందని స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

హద్దులు దాటితే కఠిన చర్యలు


ముడసర్లోవ వద్ద యువకులకు అవగాహన కల్పిస్తున్న ఆరిలోవ సీఐ గోవిందరావు

ఆరిలోవ: ఎన్నికల వేళ కావడంతో యువకులు హద్దుల్లో ఉండాలని, లేదంటే కేసుల్లో ఇరుక్కుంటారని ఆరిలోవ సీఐ జి.గోవిందరావు హెచ్చరించారు. ఆరిలోవ ప్రాంతం ముడసర్లోవ రోడ్డులో సోమవారం యువకులకు ఆయన అవగాహన కల్పించారు. కొద్ది రోజుల్లో సాధారణ ఎన్నికలు జరుగుతున్న కారణంగా యువకులు, ఆకతాయిలు మరింత జాగ్రత్తగా ఉండాలని సీఐ సూచించారు. యువత మత్తుతో పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. అల్లర్లకు పాల్పడితే కేసులు తప్పవని హెచ్చరించారు. ఎక్కడైనా ఆకతాయిలు, రౌడీషీటర్లు అల్లర్లు, గొడవలకు దిగుతున్నట్లు తెలిస్తే వెంటనే పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని ఆయన సూచించారు.

వైఎస్సార్‌సీపీ గెలుపునకు విశేష కృషి

బీచ్ రోడ్డు: వైఎస్సార్‌సీపీ భారీ విజయం సాధించేలా ఇంటింటికి వెళ్లి ప్రచారం చేస్తున్నామని మంత్రి బొత్స సత్యనారాయణకు జీవీఎంసీ 15వ వార్డు కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య, గిరిబాబు తెలిపారు.

సోమవారం సిరిపురంలో మంత్రి నివాసంలో వార్డు నాయకులతో పాటు మంత్రిని కలిసి ప్రచారం వివరాలను తెలియజేశారు. ఈ సందర్భంగా మంత్రి స్పందిస్తూ పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం కష్టపడి పని చేయాలన్నారు.


మంత్రి బొత్స సత్యనారాయణతో కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య గిరిబాబు

మళ్లీ జగనన్నే ముఖ్యమంత్రి

15వ వార్డు ప్రచారంలో వైఎస్సార్‌సీపీ భీమిలి అభ్యర్థి ముత్తంశెట్టి


15వ వార్డులో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ భీమిలి అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాస్

మద్దిలపాలెం : రాష్ట్ర ముఖ్యమంత్రిగా మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేయడం తథ్యమని వైఎస్సార్‌సీపీ భీమిలి నియోజకవర్గ అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. సోమవారం భీమిలి నియోజకవర్గ పరిధిలోని 15వ వార్డు దుర్గానగర్‌లో ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రాన్ని సంక్షేమాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్ది, పేదల జీవితాలలో వెలుగులు నింపిన సీఎం జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేయడానికి రాష్ట్ర ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ప్రతి చోటా ఎన్నికల ప్రచారానికి లభిస్తున్న ఆదరణే ఇందుకు నిదర్శనమన్నారు. ఫ్యాన్ గుర్తుపై ఓటేసి పార్టీ విశాఖ ఎంపీ అభ్యర్థిగా బొత్స ఝాన్సీ, ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ముత్తంశెట్టి కోరారు. ఈ ప్రచారంలో పార్టీ వార్డు ఇన్‌చార్జి అప్పారి గిరిబాబు, పార్టీ వార్డు అధ్యక్షుడు, జిల్లా కార్యవర్గ సభ్యుడు పీలా వెంకట్, ఆర్డీ వెంకటలక్ష్మి, నరాల సత్తిబాబు, నూతపాటి దిలీప్, రాంప్రసాద్, బుగత యేసురత్నం, తదితరులు పాల్గొన్నారు.